# కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి

- జిల్లాలో ఇంకా రెండు నియోజక వర్గాలకు ఖరారు కాని అభ్యర్థులు
- సూర్యాపేటలో ఇద్దరు, తుంగతుర్తిలో ఐదుగురు పోటీకి ప్రయత్నాలు
- గల్లీ నుంచి ఢిల్లీ దాకా మంతనాలు
- టికెట్ రాకుంటే రెబలే అంటున్న ఆశావహులు
- రెండు నెలల ముందే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన
- ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో బిజీ

సూర్యాపేట, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట కాంగ్రెస్ పార్టీలో టికెట్ కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇద్దరు నేతలు ఎవరికి వారే ప్రచార వాహనాలను తిప్పుకుంటున్నారు. తనకు 2018లో టికెట్ ఖరారు చేస్తామంటేనే టీడీపీ నుంచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నానని, ఆనాడు సీనియారిటీనో లేక మరేదో కానీ దామోదర్‌రెడ్డికి కేటాయించినా నాటి నుంచి కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేస్తూ పార్టీకి విధేయుడిగా ఉన్నానని ఈసారి ఎట్టి పరిస్థితుల్లో తనకే దక్కుతుందని పటేల్ రమేశ్‌రెడ్డి చెబుతుంటే.. అత్యంత సీనియర్ నేతను, తనను కాదని మరెవరికైనా టికెట్ వస్తుందా అంటూ దామోదర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ఇలా ఇద్దరూ ఎవరికి వారే తమకే టికెట్ వస్తుందని ధీమాతో ఉండగా ఇద్దరిలో ఎవరికి టికెట్ వచ్చినా కాంగ్రెస్ పార్టీకి రెబల్ బెడద తప్పదేమో అనే బలమైన అనుమానాలు ఆ పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కూడా జరుగని అభివృద్ధి మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో జరిగి ప్రజలంతా ఆయనకు మద్దతు ఇస్తుంటే కాంగ్రెస్‌లో ఇద్దరి నేతల పంచాయితీతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న కొద్దిపాటి బలం కూడా పోతున్నదని ఆ పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు.

## తుంగతుర్తిలో ఐదుగురు..

ఇక తుంగతుర్తి విషయానికి వస్తే అక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచే ఐదుగురు పోటీ పడుతున్నారు. అద్దంకి దయాకర్, డాక్టర్ వడ్డేపల్లి రవి, పిడమర్తి రవితో పాటు జ్ఞానసుందర్ ఎవరికి వారు టిక్కెట్ తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తుండగా మరో పక్క టికెట్ తనకే అనే గట్టి భరోసాతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు చెబుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఓ పక్క టీఆర్‌ఎస్ అభ్యర్థులే కాకుండా నాయకులు, కార్యకర్తలు అన్ని నియోజక వర్గాల్లో గ్రామ గ్రామాన ప్రచారాలు హోరెత్తిస్తుండగా కాంగ్రెస్ వర్గాలుగా మారి టికెట్ల పంచాయితీలతో టికెట్ తమకే దక్కిందంటే తమకు దక్కిందని రోజుకో పుకారు లేవనెత్తుతూ ఆయా వర్గాలు సంతోష పడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు అభివృద్ధి, సంక్షేమాలు తెలియని జనానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం తొమ్మిదిన్నరేండ్లలోనే సంక్షేమాభివృద్ధి పాలన అంటే ఏంటో చూపించిందంటున్నారు. మరి సూర్యాపేట, తుంగతుర్తిలో టికెట్ ఎవరికి దక్కుతుంది. మిగిలిన వారి పరిస్థితి ఏంటి ? రెబల్‌గా ఎంత మంది బరిలో నిలుస్తారో అనే విషయాలు తేలాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పని పరిస్థితి.

# గులాబీ జెండాయే ప్రజలకు కొండంత అండ

- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత

సూర్యాపేట టౌన్, నవంబర్ 1 : గులాబీ జెండాయే ప్రజలకు కొండంత అండ అని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో గల స్నేహనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో తొమ్మిదిన్నరేండ్లుగా సూర్యాపేట ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. 2014కు ముందు ఉన్న గొడవలు, కొట్లాటలు, కేసులు అంటూ స్టేషన్ల చుట్టూ తిప్పడాలు, సిండికేట్ దందాలు, రౌడీ రాజకీయాలను అలాగే ఇప్పటి సూర్యాపేట అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుని అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుండపునేని కిరణ్, జాకీర్, సల్మా మస్తాన్, సారంగుల కరుణశ్రీ, ప్రభాకర్, నరేందర్, చనగాని అంజమ్మ, సారగండ్ల మాణిక్యమ్మ, వాంకుడోతు పద్మ పాల్గొన్నారు.

## మంత్రిని భారీ మెజార్టీతో గెలిపించాలి..

సూర్యాపేట రూరల్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని మరో మారు భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్ సమీపంలో రైస్ మిల్‌లో హమాలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అలాగే మండలంలోని ఎండ్లపల్లి, కాసరాబాద్, బాలెంల గ్రామాల్లో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



సూర్యాపేటటౌన్ : పట్టణంలోని 14వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత

## ఇంటింటికీ సంక్షేమ పథకాలు..

ఆత్మకూర్.ఎస్ : దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతున్నదని మండలంలోని కోటపహాడ్ సర్పంచ్ మందడి శేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరారెడ్డి, వి.నాగయ్య, సోమిరెడ్డి, భీమనబోయిన ఉప్పలయ్య, శ్రీశైలం, రేఖ సైదులు, కోతి మల్లయ్య, జాల శ్రీను పాల్గొన్నారు.



ఆత్మకూర్.ఎస్ : కోటపహాడ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సూర్యాపేటరూరల్ : 13వ వార్డు గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

# అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 1 : జిల్లాలోని అర్హులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ కోరారు. బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో ఎపిక్ కార్డుల పంపిణీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. అక్టోబర్ రెండో వారంలో 48,544 కార్డులు, చివరి వారంలో 23,569 ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా అందించడం జరిగిందన్నారు. మరో 34,180 కార్డులు ఈ శనివారం లోపు పంపించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,06,293 ఎపిక్ కార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ యాదగిరి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ వెంకన్న, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీస్‌లో ఎపిక్ కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

# నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి

- సివిల్ సప్లయ్ కమిషనర్ అనీల్‌కుమార్

చివ్వెంల, నవంబర్ 1 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సివిల్ సప్లయ్ కమిషనర్ అనీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు బండమీది చందుపట్ల, అక్కలదేవిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ వెంకటరెడ్డితో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. తూకాల్లో తేడాలు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. రవాణా వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడూ లారీలు అందుబాటులో ఉండి లోడ్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జీఎం రాజిరెడ్డి, డీసీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఎం రాంపతి, ఏసీఎస్‌ఓ పుల్లయ్య, ఆర్ఐ నాగలక్ష్మి, ఏఓ ఆశాకుమారి, సీఈఓ శామ్ సుందర్‌రెడ్డి, ఏపీఎం రాంబాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



చివ్వెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ కమిషనర్ అనీల్‌కుమార్

# ఈ 4న కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం

సూర్యాపేట టౌన్, నవంబర్ 1 : ఈ నెల 4న సూర్యాపేటలో జరిగే కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంఘం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సూర్యాపేట నియోజక వర్గం వ్యాప్తంగా ఉన్న అన్ని అనుబంధ సంఘాల కార్మికులను, హమాలీలను బుధవారం కార్మిక సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుమంగళీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జి రాంబాబు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కోడి సైదులుయాదవ్ పాల్గొన్నారు.



ఢిల్లీలోని శంకర మఠంలో సమావేశమైన వైశ్య ఫెడరేషన్ నాయకులు

# శంకర రథయాత్ర సన్నాహక సమావేశానికి సూర్యాపేట వాసి

బొడ్రాయిబజార్, నవంబర్ 1 : వామనాశ్రమ మహా స్వామిజీ శంకర రథయాత్ర భారత దేశ వ్యాప్తంగా నిర్వహించడం కోసం వైశ్య ఫెడరేషన్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఢిల్లీలో వైశ్య గురు మఠ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సూర్యాపేట వాసి, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి ఈగా దయాకర్‌గుప్తా హాజరయ్యారు. సమావేశంలో వైశ్య గురుమఠం హల్దీపూర్ కోశాధికారి సందీప్ కానేకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ఈశ్వర్‌తో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

- కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, నవంబర్ 1 : భారత రాజ్యాంగం దళిత, గిరిజన, బలహీన వర్గాలకు కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రెమిడాల రాజు పిలుపునిచ్చారు. బుధవారం కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం క్రాస్‌రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ రక్షణ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న ఢిల్లీ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతికి వినతిపత్రం అందించేందుకు సంతకాలు సేకరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ధైద వెంకన్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ఇరుగు రమణ, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు సైదులు, మాజీ కౌన్సిలర్ వేల్పుల సుధాకర్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ నాయకులు

# రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు చివ్వెంల గురుకుల విద్యార్థులు

చివ్వెంల, నవంబర్ 1 : ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన పోటీల్లో చివ్వెంల మండల ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సీహెచ్.వరుణ్, బి.ఉమేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు ఈ నెల 3న వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పుండరీకాచారి తెలిపారు.



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన వరుణ్, ఉమేశ్